నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, సోమవారం 20 జనవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

సొంతింటి కల.. సాకారమయ్యేనా?

- 'డబుల్' కోసం ఎదురుచూపులు
- గద్వాలలో 41 ఎకరాల్లో 1,275 ఇండ్ల నిర్మాణం
- కేసీఆర్ సర్కారులోనే చేపట్టిన పనులు
- డిప్ ద్వారా అర్హుల ఎంపిక
- కేటాయింపులో కాంగ్రెస్ సర్కారు జాప్యం

పరుమాల శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు

గద్వాల, జనవరి 19 : ఇండ్లు లేని పేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చి పేదోడి సొంతింటి కల నెరవేర్చాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేసింది. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి యినా పేదవాడి సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదు. 2023 ఏప్రిల్‌లో ఇండ్లు లేని పేదలు డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. అయితే గూడు లేని పేదలు సొంతింటి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నిజంగా ఇండ్లు ఉందా లేదా అనే విషయాన్ని వార్డుల వారీగా అధికారులను నియమించి పూర్తి స్థాయి విచారణ చేసి లబ్ధిదారులను ఎంపిక చేసిన నేటి వరకు లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపులు జరగక పోవడంతో వారు సొంతింటి కల కోసం ఎదురు చూస్తున్నారు.

వివరాలలోకి వెళితే..

గద్వాల పట్టణ సమీపంలోని పరుమాల శివారులో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 41ఎకరాల్లో 1,275 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టింది. ఇండ్ల నిర్మాణం జీప్లస్ గా నిర్మించారు. ఒక్కో బ్లాక్‌లో 24ఇండ్లు నిర్మించారు.1,275 డబుల్ ఇండ్లకు అధికారులు దరఖాస్తులు 2023 ఏప్రిల్ ఆహ్వానించారు. 1,275 ఇండ్లకు 5,155మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పూర్తి స్థాయిలో విచారణ చేయగా అందులో 3,171మంది లబ్ధిదారులు అర్హులుగా గుర్తించారు. అయితే ఇందులో గతంలో పట్టాలు పొందిన వారు ఉండగా వారు కోర్టుకు వెళ్లారు. కోర్టుకు వెళ్లిన 504మంది లబ్ధిదారులకు సంబంధించి ఇండ్లను డిప్‌లో వేయకుండా 771ఇండ్లకు డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే ఎంపిక చేసిన సమయంలో డిప్‌లో ఇల్లు పొందిన వారికి ప్రొసీడింగ్ ఇవ్వలేదు. దీంతో డిప్‌లో ఇండ్లు పొందిన వారు తమ సొంతింటి కల కోసం ఎదురు చూస్తున్నారు. ఇండ్లకు డిప్ వేసిన సమయంలో ఇండ్లకు కొన్ని మౌలిక వసతులు కల్పించే విషయంలో వారికి కేటాయింపులేదు. అవి కల్పించిన తర్వాత అందరిని ఒకే సారి గృహ ప్రవేశం చేయిస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో డిప్‌లో డబుల్‌బెడ్రూం ఇల్లు పొందిన వారి సొంతింటి కలపై ఎన్నికల కోడ్ నీళ్లు చల్లినట్లు అయింది. ఎన్నికలు జరిగి ఏడాది దాటినా ఇప్పటి వరకు డబుల్ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులకు కేటాయింపులో జాప్యం జరుగుతుండడంతో లబ్ధిదారులు భయాందోళనకు గురవుతున్నారు. తమకు డిప్‌లో కేటాయించిన ప్రస్తుతం గద్వాలలో మారిన రాజకీయ పరిస్థితుల ప్రభావం కారణంగా ఇళ్లు వస్తుందో రాదో అనే ఆందోళనలో లబ్ధిదారులు ఉన్నారు. డిప్ తీసి ఈ ఏప్రిల్ నెల వస్తే రెండేళ్లు అవుతున్నా లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండంతో వారి తీరుపై ఇండ్లు లేని నిరుపేదలు గుర్రుగా ఉన్నారు. త్వరగా డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించి మౌలిక వసతులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించడం, స్వయంగా డబుల్ బెడ్రూం ఇండ్లు పరిశీలన చేసి పనులు వేగవంతంగా చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించినా ఆ దిశగా పనులు సాగడం లేదు. ఎమ్మెల్యే అయినా కలుగజేసుకొని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వెంటనే మిగిలిపోయిన పనులు పూర్తి చేసే విధంగా కలెక్టర్,ఎమ్మెల్యే చొరవ చూపి లబ్ధిదారులకు ఇండ్లు అందజేయాలని ఇండ్లు లేని నిరుపేదలు కోరుతున్నారు.

అధికారులతో కలిసి డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

నవాబ్‌పేట, జనవరి 19 : బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సీ.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండలంలో ఫతేపూర్ మైసమ్మ గుడి వద్ద కొల్లూరు, రుద్రారం గ్రామాలకు చెందిన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మరో మూడేండ్ల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. అంతకు ముందు కొల్లూరు గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ దప్పు స్వరూపను ఆయన పరామర్శించారు. మాజీ మార్కెట్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డీఎన్ రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలోనే కొల్లూరులోని స్వరూప ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాడెమోని నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శీనయ్య, బీఆర్ఎస్ నాయకులు గండు చెన్నయ్య, అబ్దుల్లా, గోపాల్‌గౌడ్, రాజు, రఘు, మెండె శ్రీను, సేవ్యానాయక్, రఘుగౌడ్, హన్మంతు, బాలకిష్టయ్య, జైపాల్‌రెడ్డి, నర్సింహులు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ దప్పు స్వరూపను పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

స్థానిక పోరులో గులాబీ జెండాఎగరాలి

- మాట ప్రకారం ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), జనవరి 19 : రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేసి గులాబీ జెండా ఎగరవేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కౌకుంట్ల మండలం వెంకటగిరిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఎగవేతను ప్రజలకు వివరించాలని సూచించారు. మాట ప్రకారం 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. అందరి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని కానీ దేవరకద్ర నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామంలో కూడా పూర్తిగా రుణమాఫీ కాలేదన్నారు. కేవలం 48 శాతం మందికి రుణమాఫీ చేసి అందరికీ రుణమాఫీ చేశామని చెప్పుకుంటూ మోసం చేస్తుందన్నారు. అప్పుల బాధలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కౌకుంట్ల మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలి

- బాధిత బంధువుల ఆందోళన
- అయిజ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్తత
- టిప్పర్ డ్రైవర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్
- సర్దిచెప్పిన సీఐ టాటా బాబు

అయిజ, జనవరి 19 : భారత్ మాల రోడ్డు టిప్పర్ కింద పడి మృతిచెందిన దావీద్ కుటుంబానికి పరిహారం చెల్లించాలని బంధువులు, గ్రామస్తులు పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆందోళనకు దిగారు. శనివారం రాత్రి అయిజ మండలంలోని వెంకటాపూర్ స్టేజీలో యాపదిన్నె గ్రామానికి చెందిన దావీద్ మరో ఇద్దరితో కలిసి గ్రామానికి వెళ్తుండగా రోడ్డుకు మట్టిని తరలిస్తున్న భారత్ మాల రోడ్డు టిప్పర్ ఢీకొట్టగా దావీద్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలై కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై వెంకటాపూర్ స్టేజీలోనే మృతదేహంతో శనివారం రాత్రి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు మృతదేహంతో రోడ్డుపై ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న శాంతినగర్ సీఐ టాటా బాబు, ఎస్సై విజయ్ భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, డ్రైవర్ అరెస్టు చేయకపోవడం, పరిహారం విషయంలో భారత్ మాల రోడ్డు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ఆదివారం అయిజ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు చేరుకొని ఆందోళనకు చేపట్టారు. సీఐ, ఎస్సైలు గ్రామస్తులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా ఆందోళన విరమించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక దశలో డ్రైవర్‌ను అరెస్టు చేసే వరకు పోలీస్ స్టేషన్ విడిచివెళ్లమని పోలీసులకు తెగేసి చెప్పారు. డ్రైవర్‌ను అరెస్టు చేయడం తోపాటుసోమవారం పరిహారం విషయమై కాంట్రాక్టర్‌తో చర్చించి, న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని సీఐ టాటా బాబు చెప్పడంతో ఆందోళనను గ్రామస్తులు విరమించారు. బాధితుడికి న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని పోలీసులకు గ్రామస్తులు తెలిపారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ టాటాబాబు, ఎస్సై విజయ్ భాస్కర్

డబుల్ బెడ్రూం ఇండ్లకు రక్షణ కరువు

డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం పూర్తై రెండేండ్లు కావస్తున్నా అవి లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో వాటికి రక్షణ లేకుండా పోయింది. లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో వాటికి ఏర్పాటు చేసిన గ్లాస్ కిటికీ అద్దాలు పగిలిపోతున్నాయి. పర్యవేక్షణ లేకపోవడం అందులో పశుపక్ష్యాదులు సేద తీరడంతో పాటు మందుబాబులకు అడ్డాగా మారినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. అవి లబ్ధిదారులకు కేటాయించే వరకు వాటికి అధికారులు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుదాఘాతంతో బాలికమృతి

ఇటిక్యాల, జనవరి 19 : నక్కలపల్లి గ్రామానికి చెందిన అయ్యపురెడ్డి కూతురు అనితను ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా గూడూరు మండలం మునగాలను ఇచ్చారు. అయితే అనిత తన కూతురు చిన్నారితో కలిసి సంక్రాంతి పండుగకు పుట్టింటికి వచ్చింది. ఆదివారం ఉదయం చిన్నారి(14) బాత్‌రూంలో వేడినీళ్ల కోసం ఉంచిన విద్యుత్ హీటర్‌ను ప్రమాదవశాత్తు తాకడంతో విద్యుదాఘాతంతో అపస్మారకస్థితికి చేరుకొంది. చిన్నారిని చికిత్స నిమిత్తం కర్నూల్ దవాఖానకు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందింది.

దళిత తాసీల్దార్‌కు హస్తం నేతల బెదరింపులు

- నిబంధనలకు విరుద్ధంగా పనిచేయాలని ఒత్తిడి
- మాట వినక పోతే సస్పెండ్ చేయిస్తామంటున్న నేతలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి), జనవరి 19 : అధికారులపై అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పనిచేయాలని లేక పోతే సస్పెండ్ చేయిస్తామని బెదరింపులకు దిగుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు ఒత్తిడితో పలువురు అధికారులు పనిచేయలేక సతమతమవుతున్నారు. తాజాగా పెంట్లవెల్లి మండల దళిత తాసీల్దార్‌పై అధికార పార్టీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా పనిచేయాలని ఒత్తిడి చేయడంతో ఆమె నిరాకరించారు. దీంతో అధికార మదంతో మహిళ, దళిత తాసీల్దార్ అని చూడకుండా పేపర్లను తాసీల్దార్ మొఖంపై విసిరేసి నిన్ను సస్పెండ్ చేయించిన తర్వాతే కార్యాలయంలోకి అడుగుపెడతామని కాంగ్రెస్ నాయకులు బెదిరించినట్లు తెలిసింది. శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధికి తప్పుడు సమాచారం ఇచ్చి సస్పెండ్ చేస్తామని పబ్లిక్‌లో బెదరింపులకు దిగారు. అధికార పార్టీ నాయకులు కార్యాలయాల్లో తిష్టవేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా పనులు చేయాలని ఒత్తిడి చేస్తుండడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో అధికారులు ఉన్నారు.

అధికారపార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలి..

అధికార పార్టీ నాయకులు దళిత మహిళ తాసీల్దార్‌ను బెదరించడంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆదివారం మండలకేంద్రంలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు పీవీ రావు, గోవురాజు విలేకరులతో మాట్లాడుతూ మండలానికి చెందిన అధికార పార్టీ నాయకులు తాము చెప్పిన వారికి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని దళిత తాసీల్దార్‌ను బెదరించడం సరైనది కాదన్నారు. రెవెన్యూ చట్టాలకు విరుద్ధంగా పనిచేయనని చెప్పిన దళిత తాసీల్దార్ మొఖంపై పేపర్లు విసిరి వివక్ష చూపిన అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని లేనిచో ఆందోళనలు నిర్వహిస్తాకుని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్, వెంకటయ్య, ప్రకాశ్, వెంకటస్వామి ఉన్నారు.

సరిహద్దులు దాటిన సన్నరకం వడ్లు

- 25వేల క్వింటాళ్ల ధాన్యం మాయం
- రైస్ మిల్లర్లు అధిక ధరకు విక్రయించినట్లు ఆరోపణలు
- విజిలెన్స్ అధికారుల విచారణలో వెల్లడి

గద్వాల, జనవరి 19 : రైతుల నుంచి సేకరించిన ధాన్యం ఒక టైతే..మళ్లీ ప్రభుత్వానికి అందించే బియ్యం మరొకటి. రైతుల నుంచి సేకరించిన సన్నరకం వడ్లు రాష్ట్రం సరిహద్దులు దాటడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. జిల్లాలో రెండునెలల పాటు జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి 70వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా సన్నరకం వడ్లు సేకరించి ఆయా రైస్ మిల్లులకు సరఫరా చేశారు. ఈ క్రమంలో రైస్ మిల్లర్లు అసలు వ్యవహారం మొదలు పెట్టారు.. రైతుల నుంచి సేకరించిన సన్నరకం వడ్లను అధిక ధరలకు కర్ణాటక రాష్ట్రానికి సరఫరా చేసినట్లు విజిలెన్స్ అధికారుల విచారణలో తెలడంతో సర్వత్రా విమర్శలు వెలువడుతున్నాయి. జిల్లాలో కొన్ని రైస్ మిల్లులు బియ్యాన్ని ప్రభుత్వానికి అందించే క్రమంలో అవకతవకలకు పాల్పడడంపై జిల్లాకు చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు సివిల్ సప్లయ్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రాజకీయ నాయకుడి ఫిర్యాదు మేరకు సివిల్ సప్లయ్ అధికారులు అప్రమత్తం అయి విజిలెన్స్ అధికారుల ద్వారా రహస్యంగా విచారణ చేపట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణలో అబ్బురపరిచే నిజాలు వెలుగులోకి రావడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. జిల్లాలో ఆయా రైస్ మిల్లుల నిర్వాహకులు రైతుల నుంచి సేకరించిన సన్నరకం వడ్లను రాత్రికి రాత్రే కర్ణాటక రాష్ట్రానికి అధిక ధరకు విక్రయించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 70 రైస్ మిల్లులకు అనుమతులు రాగా అందులో 37 రైస్ మిల్లులే ధాన్యం దింపినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే 37 రైస్ మిల్లుల్లో కొన్ని మిల్లు నిర్వాహకులు సన్నరకం వడ్లు 25 వేల క్వింటాళ్ల ధాన్యం మాయం చేసినట్లు విజిలెన్స్ అధికారుల విచారణలో బయటపడినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అమ్మిన ధాన్యానికి బదులుగా ఇతర రాష్ట్రంలోని తక్కువ ధరకు వచ్చే దొడ్డు వడ్లు తెప్పించినట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. అయితే ఈ వ్యవహారం బయటపడకుండా ఉండేందుకు అధికార పార్టీలోని ఓ రాజకీయ నాయకుడు చక్రం తిప్పుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారానికి సంబంధించి డీఎస్‌వో స్వామికుమార్ వివరణ కోరగా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు.

మట్టిని తవ్వడంలో కరిగిపోయిన గుట్ట

'గుట్ట'కాయస్వాహా

- కండ్ల ముందు కరిగిపోతున్నా.. పట్టించుకునే నాథుడు కరువు
- అనుమతుల పేరిట అక్రమంగా మట్టి తరలింపు
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు



టిప్పర్లలో తరలించుకుపోతున్న మట్టి

కల్వకుర్తి, జనవరి 19 : అనుమతులు ఉన్నాయనే ముసుగులో గుట్టను కరిగించేశారు.ఈ గుట్ట ఎక్కడో అడవిలో ఉండి ఎవరికీ కనిపించడం లేదని అనుకుంటే పొరపాటు. ఈ గుట్ట కల్వకుర్తి– నాగర్‌కర్నూల్ ఆర్అండ్‌బీ రహదారి పక్కన (ఇప్పుడు 167కే జాతీయ రహదారి) కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామ శివార్లలో ఉంది. పెద్దపెద్ద రాళ్లు, పచ్చని చెట్టతో అహ్లాదకరంగా ఉన్న గుట్టకు అనుమతులు గ్రహణం పట్టింది. అనుమతులు ముసుగులో అక్రమార్కులు గుట్టను కరిగించిపడేశారు.

గుట్ట క్రమక్రమంగా కరిగిపోతున్నా..ఈ దారి గుండా వెళ్లే ఉన్నత స్థాయి అధికారులకు కనిపించకపోవడం నిజంగా వింతే. వెయ్యో, రెండువేలో కాదు..లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఫలహారమైపోయింది.

అనుమతులు ముసుగులో..

నంద్యాల వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్167కే జాతీయ రహదారి కల్వకుర్తి మండలం నుంచి వెళ్తుంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా మట్టి అవసరం ఉన్న నేపథ్యంలో సదరు గుత్తేదారుకు తుర్కలగుట్ట నుంచి మట్టి తీసుకునేందుకు మైన్స్ శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పత్రాలు స్థానిక అధికారుల వద్ద లేక పోవడం విడ్డూరంగా ఉన్నది. ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టి తీసుకోవడానికి అనుమతి ఉందన్న విషయం బ్రహ్మపదార్థమైంది. రియల్ ఎస్టేట్ వెంచర్ల యజమానులు సదరు మట్టిని అప్పనంగా దోచేసుకున్నారు. నిజంగా ఒక్క మాటలో చెప్పాలంటే మట్టి మాఫియా మాయాజాలంలో గుట్ట మాయమైపోయింది. గుట్ట మట్టిని కొల్లగొడుతుంటే అధికారులు ప్రేక్షక పాత్ర పోషించాలని ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేశారు.

లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తరలిపోతుంటే సంబంధిత శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోలేనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2024 ఏడాది జూన్, జూలైలో కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పలు స్థలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా హైవే పక్కన తుర్కల పల్లి గుట్ట అనువుగా ఉందని నిర్ధారణకు వచ్చారు. అంతా సిద్ధమై జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది.

ప్రభుత్వం మారడంలో జర్నలిస్టులు ఇండ్ల స్థలాల మాటేదేవుడుడెరుగు..గుట్ట క్రమేపీ మాయమైపోతున్నది. అక్రమంగా మట్టిని కొల్లగొట్టిన వారిపై చర్యలు తీసుకుని రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా మెక్కిన సొమ్మును రాబట్టాలని ప్రకృతి ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

167కే హైవేకు మైన్స్ శాఖ నుంచి..

గుట్ట కరిగిపోవడం గురించి కల్వకుర్తి తాసీల్దార్‌ను వివరణ కోరగా గుట్ట నుంచి మట్టి తీసుకునేందుకు 167కే రహదారి నిర్మాణ గుత్తేదారుకు మైన్స్ శాఖ నుంచి అనుమతులు ఉన్నాయన్నారు. ఎంత మట్టి తీసుకోవాలనే విషయమై ఏదైనా ఆర్డర్ ఉందా అని అడిగితే.. దానికి సంబంధించిన ప్రొసీడింగ్ లేదని తాసీల్దార్ చెప్పారు. గుట్ట నుంచి విపరీతంగా మట్టి తరలించారనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో విచారణ చేపడతామని తాసీల్దార్ ఇబ్రహీం చెప్పారు.